మనవద్దనేగా వాళ్ళ మురిపాలు!

ఆత
నికి
డబ్బు
కర్చు
కాకూ
డదు

ఆమె
కుద
ర్జాలో
లోప
మురా
రాదు

శ్రీమతి పులిపాక బాలాత్రిపుర సుందరమ్మగారు

'సుశీలా...సుశీలా...పలకవేం?'

'............ .....'

'ఏం నిన్నే.'

ఫలహారము మంచినీళ్ళ చెంబు కాఫీ ఫ్లాస్కు కుర్చీ దగ్గర డ్రాయరుమీద పెట్టి మాట్లాడకుండా నుంచున్నది, తలుపుకు చేరబడి సుశీల.

'ఏం యెక్కడినుంచి ప్రత్యక్షమయావు? ఇవ్వన్నీ తెమ్మన్లేదు నిన్ను; యెందుకల్లా నుంచున్నావు శిలా విగ్రహంలాగ!' అన్నాడు శ్రీనివాసరావు కొంచం కోపంగా పేపరువంక చూస్తూ.

'నిద్రలేచారు గదా అని ఫలహారం తెచ్చాను' అన్నది నెమ్మదిగా నేలవంక చూస్తూ.

'ఇందాక నిద్రమత్తులో ఉండి నీమాటకు జవాబు చెప్పకపోతే యింతలో అంత కోపమెందుకు?'

'నాకేంకోపం?' అన్నది దీనంగా సుశీల.

'ఇందాకటినుంచీ అన్నిమాట్లు పిలిస్తే ఎందుకు పలికావు గావు?'

'మీరు పిలిచినది వినిపించలేదు?'

'వినిపించకపోతే ఇవ్వన్నీ యెల్లా తెచ్చావు?'

'ఏదో శబ్దం అయితేను మీరే నిద్రలేచి ఉంటారని తెచ్చాను.'

'అల్లాగే అంటావులే, మీ ఆడవాళ్లు యెన్ని అబద్ధాలాడినా చెల్లుతాయి. ఆడదాని బొంకు గోడ బెట్టినట్లు మగవాని బొంకు తడిక కట్టినట్లు, అను సామెత స్త్రీలపట్ల సార్థకము కాకపోదు.'

'నే నబద్ధం ఆడలేదు. నిజంగా నాకు వినిపించలేదు' అన్నది సుశీల కళ్లు తుడుచుకుంటూ.

'ఆ—మీ ఆడవాళ్ల కున్నదేగా మాట్లాడితే నారాయణాస్త్రం ప్రయోగించడం దానికి ప్రత్యస్త్రమే లేదు, నమస్కారందప్ప. దాంతో మీరు యెంత కార్యమైనా సాధిస్తారు.'

'అంత కార్యసాధనాశక్తి మాదగ్గరేముంది? మీ దగ్గరుండే ఘవర్సు ఏమన్నా మాదగ్గరున్నాయా? యేమీ చేతగాక కళ్ల నీళ్లుకార్చి మా జలుబు మేమే వదిలించుకని ఊరుకుంటాం.'

'మీ జలుబేకాదు మా జలుబూ వదిలిస్తారు. మీ కళ్లనీళ్లు చూస్తే యెంత వజ్రహృదయునికైనా మనస్సు కరిగి జాలికలగక మానదు. అప్పుడు మీరు అడిగినపని చేయక తప్పదు. దాంతో మాజలుబు వదుల్తుంది.'

'సరే యెందుకిన్ని మాటలు. పండుగకు అల్లుళ్లను తీసికొస్తే మావాళ్లకుకూడ ఉత్తరం వ్రాయమంటానని, వ్రాస్తే వాళ్లుకూడా వస్తారని. వాళ్లు వీళ్లు కూడావస్తే మీకు ఖర్చు యెక్కువౌతుందని కాబోలు మీసూచన. ఏమీవద్దు ఊరుకోండి వీలుగా ఉంటే పిల్లలు రెండు బొమ్మలు పెడతారు లేకపోతే అవీ లేదు. మీకు ఇష్టమైతే పండక్కు అల్లుళ్లను రమ్మని వ్రాయండి లేకపోతే లేదు.'

'అబ్బా! సుశీలా నువ్వెంత గడుసుదానివే? ఏదో మాటవరుస కంటే యెక్కడినుంచి యెక్కడికి పన్నావులే? మీవాళ్లు రావడం నాకిష్టం లేదన్నానా?'

'గడుసుదాన్నైతే మీలాగే ఉండేదాన్ని. మా వాళ్లు రావడం మీకిష్టంలేదని కాదు. ఖర్చుదగ్గర కొంచం గట్టిపట్టు గనుక నాకలా తోచింది.'

శ్రీనివాసరావుగారు రిష్టువాచి చూచుకుని 'అబ్బో మూడున్నరైంది నే నాఫీసుకు వెళ్లాలి. కలక్టరుగారు ఊళ్లో కాంపు వేస్తారట పనుంది. ఉత్తరాల సంగతిచెప్పు.'

'ముందు ఫలహారం చెయ్యండి.'

'నాకు ఫలహారం వద్దు కాఫీ పుచ్చుకుంటానుగాని ఉత్తరాల సంగతిచెప్పు.'

'నాకేమి తెలియదు మీరుయెవరికి వ్రాయాలనుకుంటే వాళ్లకు వ్రాయండి.'

'మరీ బెట్టుచేస్తే బాగుండదు. ఎక్కువైతే విరుగుతుంది కూడాను బెట్టు.'

'నాకేంబెట్టుసరున్నది, ఉంటేమటుకు నాకెల్లా జరుగుతుంది?'

'నాకు టైములేదు. గప్పునచెప్పు?'

'ఎక్కడికి వ్రాస్తారు పెద్దల్లుడికేగా—'

'అదేగడుసుతనం. మీ వాళ్లకు వ్రాయమని చెప్పవేం. కడంఅల్లుళ్లకు?'

'ఉత్తరాలువ్రాస్తే వచ్చేవారెవరు? పండుక్కు తీసుకరావలసిన కొత్తల్లుడుఉత్తరంవ్రాస్తేవస్తాడా? పెద్దవాళ్లనడిగి తీసుకురాకుండా చిన్నల్లుడు వస్తాడా?'

'సరే ఇంకేదో పెటకఉందే. కార్డుతోసరిపోతుందనుకున్నాను. సరే చిన్నబ్బాయి వెళ్లుతాడు?'

'మోహను వెళ్లితే బాగుంటుందా అల్లుణ్ణి క్రొత్తగా తీసుకురావడానికి?'

'బాగుండకేమి? వాడుమరీ చిన్నవాడా? సరే ఆ తిప్పలు నేపడతాలే ఉత్తరాలివ్వేగదా? వీసురావడం ఆలస్యమైతే వాడిని పంపుదబ్బిచ్చి?'

శ్రీనివాసరావుగారు చాలామరియాద కలవారే కాని ఖర్చుదగ్గరకొంచం గట్టిపట్టు. ఇప్పుడు ఈప్రయత్నానికి యెంతడబ్బుఖర్చు అవుతుందో అని సందేహం ఉన్నది కాని, భార్యచెప్పినవన్నీ తేకపోతే ఆమెకు గుస్సు. అల్లుళ్లకుకోరినట్లుయివ్వకపోతే వారికికోపము. కొంచముతో సరిపుచ్చితే తమదర్జాకులోపము. అన్నీ చేస్తే ఇంటిఖర్చుగాక నాలుగైదువందలకు తక్కువ ఉండదు, అని కొంచమునేపు ఆలోచించి యేమైనా

గాని ఈ ఖర్చు యెప్పుడైనా తప్పదుగదా అని సరే అన్నారు శ్రీనివాసరావుగారు.

శ్రీనివాసరావుగారు కాఫీ త్రాగుతూ ఉండగా బంట్రోతు వచ్చి 'అయ్యగారు! కలక్టరుగారు ట్రావిలర్సు బంగాళాలో దిగారండీ' అన్నాడు. 'అట్లనా కలక్టరుగారు వచ్చారు' అని ఆతురతగా అడుగుతూ లేచి డ్రెస్సు వేసుకుంటూ

'సింగూ! కారు తీసుకురావోయి' అన్నారు శ్రీనివాసరావుగారు.

సింగు కారు తెచ్చాడు వాకట్లోకి. కారెక్కి ఆఫీసుకి వెళ్లారు.

2

సుశీల చాల తెలివికలది, బుద్ధిమంతురాలు. నౌకర్లు ఎంతమంది ఉన్నా భర్తగారి సేవ తాను స్వయముగా చేస్తుంది. భర్త కోపదారి. ఖర్చు విషయములో కొంచం గట్టిపట్టువాడు. అయినప్పటికీ సుశీల ఖర్చు వచ్చినప్పుడు తమ దగ్గర జాములో పంరాకుండా భర్తకు నచ్చజెప్పి పనుల సానుకూలం చేస్తూ ఉంటుంది.

'యేమిరా మోహను! మీ నాన్నగార్ని బ్రతిమాలి వప్పించేటప్పటికి నాపనైంది. ఇక నువ్వేమంటావు?'

'నాదేముందమ్మా నువ్వు చెప్పినట్టే వింటాను.'

'ఏలూరు వెళ్లి మీ వదిన్ని మీ చిన్న బావను పిలుచుకు రావాలి.'

'అబ్బా నా వల్ల కాదు. ఊళ్లో ఏదన్నా పని చెప్పు చేస్తాను.'

'అయితే ఎల్లాగ? ఎవరు తీసుకొస్తారు?'

'అన్నయ్యను వెళ్లమను.'

'అన్నయ్య కొత్తల్లుడికోసం గుంటూరు వెళతాడు నువ్వు యేలూరు వెళ్లు.'

'చిన్నాయన మరీ బెట్టుసరి మనిషమ్మా' ఆయన్ను సంవత్సరంలోపల తీసుకురావడానికి అన్నయ్య వెళ్లితే వస్తామని రామని నానాతిప్పలు పెట్టి చివరకు రాకపోతే నాన్నగారు వెళ్లి తీసుకొచ్చారు జ్ఞాపకం లేదూ?'

'ఇప్పుడలా కాదు ఎవరన్నా వస్తే పంపుతామని అన్నారు. తప్పక నీతో వస్తాడు.'

'సరే నాన్నగారు రానీ ఆలోచించుదాం.'

'మీ నాన్నగారు చెప్పేవెళ్లారు. మీరు రాత్రి బండికి వెళ్లండి అన్నయ్యా నువ్వూను.'

కొడుకులిద్దర్నీ అల్లుళ్ల కోసము, కోడలికోసము పంపింది సుశీల.

3

ఇంజనీయరుగారింట్లో బొమ్మలుకొలువు చాలా వినోదంగాను, ఆకర్షణీయంగాను ఉన్నది. పేరంటపు సమయమునే గాక ప్రొద్దుగూకులు జనం చూచి పోతున్నారు. ఆ చేతిపనులు, ఆ సొట్టుపనులు, ఆ సీమబొమ్మలు ఆ కొండపల్లి బొమ్మలు, వివిధరకములైన ఆ బొమ్మల కొలువు చూచుటకు యెంత ఆనందముగా ఉన్నదని ఊరిలో ప్రతియింటా ఇంజనీయరుగారి ఇంటిబొమ్మల కొలువు సంగతులు చెప్పుకొంటూ ఒకరినొకరి పిలుచుకుని వచ్చి చూచేవారు. ఊరంతా కోలాహలంగా ఉన్నది. దేవీనవరాత్రులు బొమ్మలుకొలువులతో నిండిఉన్నది బెజవాడపట్టణమంతా.

మధ్యాహ్నం మూడుగంటలైంది.

నూనెదువ్వెన దగ్గిర పెట్టుకు కూర్చుని పిల్లల్ని పిలిచింది సుశీల.

'అమ్మా రోజూ నేనే వెళుతున్నా ఇవ్వాళ చిన్నక్కను వెళ్లమను' అన్నది సరోజిని.

'భానూ! ఇవ్వాళ నీవుకూడ వెళ్లమ్మా' అన్నది తల్లి భానుమతి వంకచూచి.

'నాకు తలనొప్పిగా ఉంది. పెద్దక్క వెళ్లి నాలుగు రోజులైంది. ఇవ్వాళ దాన్ని వెళ్లమను' అన్నది భానుమతి.

'పెద్దక్క వెళ్లితే ఇంట్లో పనులెల్లా అవుతాయి?

ఇవ్వాళ చుట్టపక్కాలుకూడా వస్తారు. ఇవ్వాళ కారేసుకువెళ్లి దూరపుపేటల్లో పిలిచిరండి దగ్గిర వీధులు రేపు పిలుస్తురుగాని.'

'సరే జడవెయ్యి' అన్నది భానుమతి.

'అజాజీలు గులాబిపువ్వులు తీసుకరా బుట్టలో ఉన్నాయి చేమంతిపువ్వులు రేపటికుంటాయి.'

సుశీల పిల్లలకు శృంగారించి పంపి తానుకూడా తలదువ్వుకుని మేడమీదా, క్రిందా, ఇల్లంతా శృంగారించి ఫాషన్‌గా ఎక్కడివక్కడ అమర్చింది. ఏ బండికి యెవరు వస్తారో అని ఎదురు చూస్తున్నది. వచ్చారు అన్ని ఊళ్లనుంచీ అందరు ఒకగంటలోపల, పెద్దల్లుడుమటుకు ఇంకా రాలేదు.

అల్లుళ్లకు కాళ్లకు నీళ్లిచ్చి తలుపుచాటునుంచి కుశలప్రశ్న లడిగింది. బావమఱదులు అల్లుళ్లు అందరు పందిట్లో కుర్చీల్లో కూర్చున్నారు. కోడల్ని ఇంట్లోకి పిలుచుకుపోయి కుశలప్రశ్న లడిగి తనదగ్గిర కూర్చో బెట్టుకుంది సుశీల.'

'వాణీ నిన్ను వక్కత్తెనే పంపారేం మీ వాళ్లు?' అన్నది సుశీల కోడలితో.

'మా బావలిద్దరు చెన్నపట్నంనుంచి వచ్చారు మా అమ్మకు తీరకుండా ఉన్నది. మా అక్కయ్యకు జ్వరం వస్తున్నది. మా చిన్నక్క బొమ్మలు పెట్టుకుంటుందిట అందువల్ల యెవరికి వీలుకాలేదు' అన్నది వాణి.

యింతలో మేడమీదినుంచి సుశీల పెద్దకూతురు విమలవచ్చి 'యేమిా? నీ కోడలు వక్కతేవస్తే పిల్లెత్తుకుపోతుందా?' అన్నది చమత్కారంగా.

'మీలాగ గడుసుదిగాదు నా కోడలు' అన్నది సుశీల కోడలిపక్షంగా.

౪

ఇంటికి యెవ్వరు వచ్చినా చప్పున పలుకరించే అలవాట్లేదు శ్రీనివాసరావుగార్కి. ఆఫీసునుంచి వస్తూనే హాల్లో వంకెకు కోటు తగిలించి సుశీలను పిలిచారు.

'సుశీలా! పెద్దల్లుడు రాలేదే, నేను చెప్పలేదూ? వీలుగాఉంటే వస్తాను లేకపోతే లేదు అని వ్రాశావని అల్లాగే చేశాడు. అతను బహు బెట్టుమనిషి. అబ్బా నా ప్రాణం విసుగుతున్నది వీళ్లను సాగతీయలేక బ్రతిమాలలేక' అని విసుక్కున్నారు శ్రీనివాసరావుగారు.

'ఎందుకల్లా విసుక్కుంటారు నిమిషంలో కోపం వస్తుంది మీకు. ఇప్పుడే మిం్రించిపోయింది? ఇంకా చెన్నపట్నంనుంచి వచ్చేబండి వకటుంది గదా ఆ బండికి వస్తారేమొ?'

'ఎందుకు వస్తాడు రావని వ్రాసిన తరువాత, మళ్లీ బెట్టు తగ్గమూ?'

'మళ్లీ పెద్దవాడు ఉత్తరం వ్రాశాడు తప్పక రమ్మని, అమ్మాయిని తీసుకువెళ్లుదుగాని అని. ఇంతలో అంత కోపమూ తొందర యెందుకూ?'

'నాకు కోపమొస్తే మాత్ర నీకేం లోపం?'

'అయ్యేది అవుతుంది. ఎప్పుడూ మీ కోపంతోనే సరిపోతుంది. లోపం లేకపోతే మటుకు యెప్పుడూ చిఱ్ఱుబుఱ్ఱు అంటూ ఉంటే కష్టంగా ఉండదూ?'

'ఏ కష్టంగా ఉన్నా నేను చెయ్యవలసిన ఖర్చు లేవన్నా తప్పతున్నాయా' అనుకుంటూ పందిట్లో వెళ్లి తానుకూడా ఒకకుర్చీలో కూర్చున్నారు శ్రీనివాసరావుగారు. ఇక అల్లుళ్లను పలుకరించాలి. ఆలశ్యమైతే కోపమొస్తుందని భయం. యేం పలుకరించాలో తోచలేదు. ఇంతలో పెద్దల్లుడు వచ్చాడు.

'ఏం కృష్ణారావు ఇప్పుడేనా బండీ వచ్చింది?' అన్నాడు శ్రీనివాసరావుగారు.

'అవునండీ' అన్నాడు అల్లుడు.

'రాఘవరావు నువ్వేబండీకొచ్చావు?' అన్నాడు చిన్నల్లుణ్ణి.

'సాయింకాలంబండికొచ్చానండీ.'

కొత్తల్లుడి వంకచూచి 'మీ పరీక్ష లెప్పుడైనాయి ప్రసాదరావు?'

'ఇరవయ్యోతేది.'

ఇంతలో వంటైందని యింట్లోనుంచి కబురొచ్చింది. అందరు లేచి భోజనాలకు వెళ్లారు. భోజనాలు చేసి లేచి మేడమీదికెళ్లి తాంబూలపళ్లెం దగ్గిర కూర్చు న్నారు పూర్ణచంద్రాకృతిగా మామఅల్లుళ్లు బావమఱదులు అందరు. నౌకరు వచ్చి అమ్మగారు చెప్పిన ప్రకారం ప్రక్కలు లమర్చి వెళ్లిపోయినాడు. అందరు లోకాభిరామాయణం మాట్లాడు కుంటూ ఒకగంట గడిపిన తరువాత యెవరిప్రక్కమీద వారు పడుకుని నిద్రపోయారు. పెద్దల్లుడు పేపరు చదువుకుంటూ పడుకున్నాడు.

విమల అందరికంటే పెద్దపిల్ల గనుక రోజు సాయంకాలమే నిద్రపోయేదైనా ఆ రోజు తల్లితోపాటు మేలుకునే ఉన్నది.

సుశీలా విమలా సూరమ్మగార్లు భోజనాలు చేసి హాల్లోకొచ్చారు.

'విమలా! ఇవ్వాళ నేను క్రింద పడుకుంటాను నీవు పైకి వెళ్లు' అని పలహారం తాంబూలపళ్లెం మంచినీళ్లచెంబు అందించింది కూతురుకి.

అన్నీ చేతపుచ్చుకుని పైకి వెళ్లింది విమల.

'ఓహో! విమలాదేవిగారు నన్ను మరచారనుకుంటాను' అన్నాడు చిరునవ్వుతో.

'ఆర్యపుత్రులు తమరు మరచిపోవాలి గాని తమ పాదదాసి మరచిపోతుంచా?' అన్నది విమల తల వంచి కొంచం సిగ్గుతో.

'సాయంత్రంనుంచీ కనిపించకపోతే అనుకున్నాను.'

'నేను వ్రాసినలేఖ తమకు ముట్టినదా?'

'ఆహా ముట్టినది.'

'కొంచం పలహారం చెయ్యండి.'

'ఉత్తరం సంగతి పూర్తి చెయ్యవేం?'

'యేముంది, పూర్తిచేసేందుకు? చేరిందన్నారు గదా.'

'ఉత్తరంలో సంగతులకు ప్రతిఫలం కనుక్కో...'

'ఏం కనుక్కోవాలి?'

'తెచ్చినది లేనిది.'

'తెస్తే తమరే ఇవ్వరా?'

'అదుగో ఆ కోటుజేబులో పాకెట్టు ఉందిచూడు.'

'నేను వ్రాసిన రిబ్బన్లు ఇవ్వి కావు.'

'సరే వకటైంది, కడంవికూనా చూడు.'

'స్త్రీహృదయం నాకు అనుభవంలేక తెచ్చాను గాని మగవారు తెచ్చినవి మీకు నచ్చుతాయా?'

'నచ్చకేమీ? ఇవ్వి ఇంకోరకం అన్నాను గాని ఇవ్వీ బాగానే ఉన్నాయి.'

'కెంపులబిళ్ల బాగుందా అదికూడా అసంతృప్తిగానే ఉందా? చూడు నీవు వ్రాసిన మంచి గంధం పాకెట్లు అవేనా?'

'అన్నీ బాగానే ఉన్నాయి. నేను వేస్కాని' కన్నాను గాని చక్కగా ఉన్నాయి.'

'ఇక నీవు యెన్ని చెప్పినా నమ్మను పైకి అంటున్నావుగాని నీకు యేవి నచ్చలేదన్న మాట.'

'లోపలొకటి పైకొకటి ఉంటాయా? నమ్మకపోతే నేనేం చెయ్యను. మీరు పలహారం చెయ్యండి.'

'ఇప్పుడేం పలహారం నాకొద్దు కావలిస్తే నువ్వు తిను. నాకు నిద్దరోస్తోంది. ఆదీపం తగ్గించు' అన్నాడు కృష్ణారావు.

✂

'తెల్లవారింది. కాఫీ ఇడ్డెనులు, పలహారాలు పెట్టడం భోజనాల హడావుడిలో ప్రొద్దుగూకులు తీరుబాటులేకుండా చేస్తున్నది సుశీల. పిల్లలు పనుపుకుంకాలు పెట్టడంతో తీరుబాటులేకుండా ఉన్నారు. వచ్చిన మర్రోజు మొదలు క్రొత్తల్లుడు ప్రసాదరావు వెళతానని మాటిమాటికి ప్రయాణం అవుతున్నాడు. ఆయన్ను ఉండమని సాగతియ్యలేక బావమఱుదులిద్దరు విసిగిపోతున్నారు. ఇల్లా మూడు రోజులు గడిచాయి. నాలుగో రోజు తెల్లవారింది, విజయదశమి. మామూలుకంటే ఇంకా ఇద్దరు వంట మనుష్యుల్ని పెట్టింది సుశీల. వంటవారికి వంట సామాను పిండి

వంటలవారికి పిండివంటల సామాను వారికి అందిచ్చి యెవరి పన్లు వారికి చెప్పి వొప్పగించింది.

ఇంతలో శ్రీనివాసరావుగారు బజారునుంచి వచ్చి పిలిచారు.

'సుశీలా! ఇల్లారా. యివిచూచి పనికొచ్చేవి ఉంచి పనికిరానివి వాపస్ చెయ్యి.'

'ఇవిగో దిష్టువాచీలు రెండు మణికట్టు గొలుసులతో సహా, మూడువందల పాతిక బాగున్నాయా?'

'పెద్దల్లుడి గడియారం లాంటిదే తేకపోయారా? గొలుసులు డాబుగా లేవు.'

'అప్పుడు వక్కటి గనుక రెండువందల యాభై పెట్టి రవ్వలున్న పతకం గొలుసు తెచ్చాను. ఇప్పుడు రెండూ అంతడబ్బు పెట్టొద్దూ? పొలమ్మీద ఆదాయం కూడా తగ్గిపోయె. సాలుకు యెనిమిదివేలు ఇచ్చేవాళ్లు, ఇప్పుడు ఐదువేలు ఇచ్చేటప్పటికి చస్తున్నారు. ఉన్నంతలో సరిపుచ్చాను ఏం చెయ్యను.'

'సరే నోరత్తకుండా చెపుతారు వక్కమాట. బట్టలివ్వేనా?'

'అవును ఈ చాపులు రెండూ చిన్నవారివి, ఇది పెద్దతని.'

'ఏమిటి ఇల్లాంటివి తెచ్చారు, నేను చీటీలో వ్రాసినవి ఇల్లాంటివి కావు.'

'ఏమి ఇప్పుడివి పనికిరావూ?'

'ఏమిలేదు లెండి బాగానే ఉన్నాయి గాని—'

'కాని అంటున్నావే అనుమానం యేమిటో చెప్పు.'

'ఏమీలేదు అంచులు కొంచెం చిన్నవిగా ఉన్నాయి. మనమేం యెప్పుడూ పెడతామా? పండుక్కి తీసుకొచ్చాం గనుక కొంచం మంచివిగా ఉంటే బాగుంటుంది. పెద్దల్లుడిది ఇల్లాంటిది తెచ్చారేం?'

'అతనికి మొన్న అమ్మాయిని పంపేటప్పుడు పెట్టాంగా?'

'అప్పుడూ మంచివి పెట్టలేదనే సాధిస్తున్నారు. అదీ గాక వాళ్లకు వకరకం అతనికి వకరకం బాగుంటుందా?'

'సరే ఇచ్చేవీను నీకు నచ్చలేదన్నమాట. ఇదుగో గోదలిచీర. ఇవి అమ్మాయిల చీరలు. ఇవ్వన్నా పనికొస్తాయా? అదేమి ఖర్మమో గాని ఇంత ఖర్చు పెట్టినా తృప్తి చెందించలేను' అని విసుక్కున్నారు శ్రీనివాసరావుగారు.

'అన్నీ పనికొస్తాయి లెండి.'

'ఇంతా ఖర్చు పెట్టి మళ్లీగునిపెంచుకు లోపలగునుస్తూ పైకితృప్తిచెందటం యెందుకు.'

'మీకోపమె అందుకు కారణం' అన్నది అవతలికి వెళ్లి నెమ్మదిగా.

'ఎందుకా కూనిరాగాలు? చెప్పు కావలసినవి. ఒరే మోహను, అన్నయ్య బట్టలకొట్టు మీదున్నాడు. మీ అమ్మ యేవో చెపుతుంది గాని అవితీసుకుని యివ్వి యిచ్చేసి చప్పునరండి.'

'అమ్మా! యేమిటి? చెప్పత్వరగా.'

'ఏముందీ? చెప్పేందుకు?'

'సేలంఅంచుపట్టు ఉత్తరీయాలు ధోవతులు వెడల్పుఅంచుగలవి మంచిజరీవిచూచి మూడువకరకం తీసుకురండి, వంటైందిచప్పునరండి.'

'సుశీలమ్మగారు పరవాన్నంలోనికి యాలకులపొడి ఇవ్వండి వంటైంది స్నానాలు చెయ్యొచ్చు' అన్నది వంటావిడ.

'పిల్లలు బజారునుంచివచ్చారు తల్లిచెప్పిన ప్రకార బట్టలుతీసుకొని. అందరుప్రొద్దున్నే అభ్యంగనాలు చేశారు గనుక కాళ్లుకడుక్కుని మడికట్టుకుని భోజనాలు చేసి మేడమీదికెళ్లారు.

సుశీలాపిల్లలు భోజనాలుచేసి జడలువేసుకుంటూ హాల్లో కూర్చున్నారు.

'అమ్మా! బావలుముగ్గురు వెళతారుట. ప్రయాణాలౌతున్నారు' అన్నాడు మోహనరావొచ్చి.

'ఇంకా పండుగ సొంతం వెళ్ళిపోండే ఏం ప్రయాణాలురా. రేపు వెళ్ళవచ్చునని చెప్పు.'

'చెప్పానమ్మా. ఉండడానికి వీలు కాదని వెళ్ళాలని బెట్టు చేస్తారు. మూడో ఆయన వచ్చిన మర్నాటినుంచీ ప్రయాణం అవుతూనే ఉన్నాడు కదా. చిన్నాయనకు యేవో పన్లున్నాయిట. పెద్దబావకు సెలవైపోయిందిట 'అమ్మాయిని యివ్వాళ పంపితే తానుతీసుకెళ్ళుతాడుట లేకపోతే మనమేతీసుకెళ్ళి దిగబెట్టాలట. తలా వకమాట వాళ్ళిష్టమొచ్చినట్లుమాట్లాతున్నారు, ఎంతచెడ్డా అల్లుళ్ళు కాదూ? ఉండటానికి వీల్లేదని మహాబెట్టు చేస్తున్నారు.'

'మీ నాన్నగార్ని లేపు. అమ్మాయిని అన్నయ్య చెన్నపట్నం వెళ్ళేప్పుడు తీసుకొస్తాడని ఆయనతో చెప్పు.'

'నాన్నగారు లేచే ఉన్నారు.'

'మీ నాన్నగారితో, చెప్పు, నెమ్మదిగా ఉండమని చెప్పుమని.'

'కిందికొస్తున్నట్లున్నార్లే నువ్వే చెప్పు.'

'సుశీలా! యేమిటి వాళ్ళువెళతారుట' అన్నారు శ్రీనివాసరావుగారు క్రిందికొచ్చి.

'ఉండమని చెప్పండి, వెళతామనంగానే ఊరుకుంటారా?'

'ఊరుకోక యేంచెయ్యను! ఉండమంటే ఉంటారా? వాళ్ళకు సెలవులు అయిపోయినాయిట, వెళతామంటున్నారు; సరే నువ్వు చెప్పిన ప్రకారం చెపుతా ఉండమని. ఉండకపోతే యేంచెయ్యనూ?'

'యేమిలేదు పండుగ్గదా? బట్టలివ్వండి తరువాత ఉన్నా సరే వెళ్ళినా సరే, ఇదిగో తమలపాకులు తీసుకెళ్ళండి.'

'నే నెందుకూ? పిల్లలిస్తార్లే.'

'అన్నింటికి వాళ్ళను పంపతారేమిటి? పెద్దవాయి మీరివ్వక.'

'నాకు సిగ్గుగా ఉంటుంది.'

'అల్లుళ్ళువచ్చాక వాళ్ళను పిలవడం మరియాద చెయ్యడం సిగ్గైతేయెల్లాగా?'

'సరే ఇల్లాయియ్యి ఇందుకే నిన్ను గడుసుదానినంటాను. నేను చెయ్యనూ అని యెంతగట్టిగా అనుకున్న పనిని నీవంతగట్టిగా నాచేత చేయిస్తావు. నాకు కోపం రాకుండా.'

శ్రీనివాసరావుగారు అల్లుళ్ళకు బట్టలిచ్చికొడుకులిద్దరు తమరూ క్రొత్తవస్త్రములు ధరించి షికారువెళ్ళారు కారేసుకొని. సుశీలా పిల్లలులూ కూడా జడ వేసుకుని పువ్వులు పెట్టుకొని క్రొత్తదుస్తులు ధరించి పేరంటాండ్రకు రవికలగుడ్డలు కొబ్బరికాయలు పసుపు కుంకములు ఇచ్చేపనిలో నిమగ్నులైనారు.

'అన్నివిధాలా ఉంటే దసరాపండుగంటి సరదాగల పండుగ ఇంకొకటి లేదు.

౬

అల్లుళ్ళంతా వెళ్ళాక 'యేం పండుగ కర్చు అయిదువందలైంది. నీవు నీఅల్లుళ్ళు సంత్రుప్తి చెందినట్టేనా?' అన్నారు శ్రీనివాసరావుగారు సుశీలతో.

'యేమిసంతుష్టో. 'మా మామగార్కి ఏటాజీతం ప్రమోషన వొస్తూవున్నా మా నేలంఅంచు పంచలకు ప్రమోషనుండ' దన్నాట్ట పెద్దల్లుడు విమలతో. 'మీ నాన్నగారు ఈ చౌకరకం రిష్టువాచీలు యెక్కణ్ణించి తెప్పించారో; స్పెషలుగా మోహనరావూ' అని నవ్వారుట చిన్నల్లుళ్ళిద్దరు మోహనుతో' అన్నది సుశీల.

'అల్లుని మంచితనంబును' అన్నపద్యం మాదిరిగా వాళ్ళకు సంతృప్తి ఉన్నదేమో చూడు' అన్నారు శ్రీనివాసరావుగారు కోపంగా.

'ఏదో నవ్వుటాలకన్నారు కాబోలు, మీకన్నిటికీ కోపమే. మనవద్దనేగా వాళ్ళమురిపాలు' అన్నది సుశీల.

'ఆహా నీమురిపెమెక్కడ?' అన్నారు శ్రీనివాసరావుగారు.